నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, ఆదివారం 16 మార్చి 2025 | HYDERABAD

గ్రేటర్‌లో ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు చేరవయ్యాయి. శనివారం గరిష్ఠం 38.4, కనిష్ఠం 23.3 డిగ్రీలు, గాలిలో తేమ 27శాతంగా నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. - సిటీబ్యూరో

కేసీఆర్ లేకుంటే తెలంగాణ ఎక్కడిది?

సీఎం రేవంత్‌పై ఎమ్మెల్యే కేపీ ఆగ్రహం

హైదరాబాద్, మార్చి 15 (నమస్తే తెలంగాణ): పులకేసిలా సీఎం రేవంత్ తీరు ఉందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ విమర్శించారు. శనివారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఎమ్మెల్యే వివేకానంద్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్ తన ప్రసంగంలో ప్రభుత్వ పనితీరు గురించి చెప్పాల్సి ఉన్నా.. అది మరిచి కేవలం కేసీఆర్, వారి కుటుంబంపై విమర్శలకే సమయం కేటాయించారని మండిపడ్డారు. కేసీఆర్ లేకుంటే తెలంగాణ రాష్ట్రం ఎక్కడిదని, రేవంత్‌కు ముఖ్యమంత్రి పదవి ఎక్కడిది? అని ప్రశ్నించారు. ఢిల్లీలో సీఎం రేవంత్‌కు వ్యాపారాలు ఉన్నాయని.. అందుకే తరచూ ఆయన ఢిల్లీ పర్యటనలకు వెళ్తున్నారని ఆరోపించారు. బీజేపీ, కాంగ్రెస్ లోపాయికారి ఒప్పందం కుదుర్చుకున్నాయని ఆరోపించారు.

కుర్మల్‌గూడలో ఓ ఇంటి వద్ద బోరునీటిని డ్రమ్ముల్లో నింపుకొంటున్న దృశ్యం

జీడిమెట్ల లోని వాణి కెమికల్స్ రిజర్వాయర్ వద్ద బారులు తీరిన ట్యాంకర్లు

నీళ్లకు కటకట

- గొంతెండుతున్న 'మహేశ్వరం'
- 15 రోజులకోసారి నీటి సరఫరా
- అవస్థలుపడుతున్న ప్రజలు
- బోర్లు ఉన్న వారిని బతిమిలాడి నీరు తెచ్చుకుంటున్న వైనం

బడంగ్‌పేట: మహేశ్వరం నియోజకవర్గం పరిధిలో చాలా ప్రాంతాల్లో నీటి కటకట మొదలైంది. గతంలో మిషన్ భగీరథ ద్వారా గ్రామాలు, కాలనీల్లో నీటి సరఫరా సజావుగా జరిగేది. ఎక్కడ కూడా ప్రజలు బిందెలతో, డ్రమ్ములతో నీళ్ల కోసం పడిగాపులు కాసేవారు కాదు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు నీటి కష్టాలు మొదలయ్యాయి. మహేశ్వరం నియోజకవర్గం పరిధిలోని కుర్మల్ గూడ, మల్లాపూర్, నాదర్ గూల్, గుర్రం గూడా పరిధిలోని పలు కాలనీల్లో, జల్ పల్లి మున్సిపాలిటీ పరిధిలోని షాహిన్ నగర్, వాదే ముస్తఫా, పహాడీ షరీఫ్, మీర్ పేట మున్సిపల్ కార్పొరేషన్ నందిహిల్స్, రాఘవేంద్ర కాలనీ, కమలానగర్ ఇతర ప్రాంతాల్లో నీటి సమస్య ఉంది. ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి.

డ్రమ్ముల్లో నీరు పట్టుకొని..

పేదలు నివాసముండే కాలనీల్లో నీటి సమస్య తీవ్రంగా ఉంది. కుర్మల్ గూడ లో నీటి సమస్యతో ప్రజల అల్లాడిపోతున్నారు. ఆటోల్లో డ్రమ్మును పెట్టి నీళ్లు దొరికే ప్రాంతాలకు వలసలు పోతున్నారు. బోర్లు ఉన్న వాళ్లను బతిమిలాడుకొని.. డ్రమ్ముల్లో నీటిని పట్టుకొని పోతున్నారు. 15 రోజులకోసారి వచ్చే మంచినీళ్ల కోసం మహిళలు నీటి యుద్ధాలే చేస్తున్నారు. కాగా, మార్చి మాసంలోనే నీటి సమస్య ఇలా ఉంటే ఏప్రిల్.. మే లో నీటి కష్టాలు తారాస్థాయికి చేరి ప్రమాముందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నీటి సమస్య ఉన్న మాట వాస్తవమే

కుర్మల్ గూడలో నీటి సమస్య ఉన్న మాట వాస్తవమే. కాలనీవాసులు సమస్యను నా దృష్టికి తీసుకొచ్చారు. బోర్లు వేయించాలని ఫిర్యాదు చేశారు. అక్కడ చాలా బోర్లు వేశాం. మరో మూడు బోర్లు వేయించేందుకు ప్లాన్ చేస్తున్నాం. వాటర్ వర్క్స్ అధికారులతో మాట్లాడుతున్నాం. వేసవికాలంలో నీటి సమస్య రాకుండా ప్రణాళికలు రూపొందిస్తున్నాం. చాలా చోట్ల నీటి సమస్యలు ఉన్నట్లు తెలుస్తున్నది. దశల వారీగా సమస్యను పరిష్కరించే ప్రయత్నం చేస్తున్నాం.

- కమిషనర్ సరస్వతి

ప్రభుత్వం స్పందించడం లేదు..

డ్రమ్ములను ఆటోల్లో పెట్టుకుని ఇతర ప్రాంతాల నుంచి నీటిని తీసుకొస్తున్నారు. ప్రభుత్వం స్పందించడం లేదు. అసలే వేసవికాలం. నీటి సమస్య జటిలంగా మారింది. ప్రతిరోజూ నీటి కోసం జనం బారులు తీరుతున్నారు. ప్రభుత్వం మాత్రం ముద్దు నిద్ర వీడడం లేదు. ఎన్నిసార్లు ఎవరికీ ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు.

-భాస్కర్ రెడ్డి

మా గోడు ఎవరూ వినడం లేదు..

15 రోజులకోసారి కూడా నీళ్లు రావడం లేదు. ఎవరినో ఒక్కరిని అడిగి డ్రమ్ముల్లో నీళ్లు తెచ్చుకుంటున్నాం. మంచినీళ్లు ఇవ్వకపోయినా సరే కానీ వాడుకోవడానికి బోరు నీళ్లు అన్న ఇవ్వాలని ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా మా గోడు ఎవరూ వినడం లేదు. **- సుజాత**

అసలే అరకొర.. ఆపై లో ప్రెషర్

'కత్బుల్లాపూర్'లో తాగునీటికి అవస్థలు

దుండిగల్, మార్చి 15: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలో ఇంకా ఎండలు ముదరకముందే తాగునీటికి ఇబ్బందులు తప్పడం లేదు. ప్రధానంగా మురికివాడలు బస్తీల్లో ఈ సమస్య అధికంగా వేధిస్తున్నది. అసలే నాలుగైదు రోజులకు ఒకసారి తాగునీటి సరఫరా అవుతుండగా, అది లో ప్రెషర్ తో వస్తుండటంతో ప్రజలు నీటి కోసం ఇబ్బందులు పడక తప్పడం లేదు. నియోజకవర్గ పరిధిలోని కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్లతోపాటు, కొంపల్లి , దుండిగల్ మున్సిపాలిటీలు, నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలు కాలనీలు బస్తీల్లో తాగునీటి ఎద్దడి అప్పుడే మొదలైంది. గతంలో రోజు విడిచి రోజు వచ్చే తాగునీరు ప్రస్తుతం నాలుగైదు రోజులకు ఒకసారి వస్తుందని, అది కూడా అర కొరగానే వస్తున్నాడంతో ప్రజలు ట్యాంకర్ల వైపు చూస్తున్నారు. కొన్నిచోట్ల గంటల కొద్దీ సమయం తీసుకుంటున్న జలమండలి వాటర్ ట్యాంకర్లు, మరికొన్ని ప్రాంతాల్లో మాత్రం 24 గంటల వరకు సరఫరా చేయలేని పరిస్థితి నెలకొందని ప్రజలు పేర్కొంటున్నారు. అదే సమయంలో ప్రైవేట్ ట్యాంకర్ల నిర్వాహకులు సైతం ఇష్టారాజ్యంగా డబ్బులు వసూలు చేస్తూ అందరకాడికి దండుకుంటున్నారని వాపోతున్నారు.

ప్రతి నిమిషానికి.. రెండు ఉల్లంఘనలు

పోలీసుల స్పెషల్ డ్రైవ్‌లో కేసులే కేసులు

- సిటీలో యథేచ్ఛగా ట్రాఫిక్ ఉల్లంఘనలు..
- రూల్స్ బ్రేక్ చేస్తున్న వాహనదారులు
- 61 ప్రాంతాల్లో రాంగ్‌రూట్ డ్రైవింగ్

సిటీబ్యూరో: నిముషానికి రెండు.. ఐదు రోజుల్లో పదిహేనువేలు.. ఇది ట్రాఫిక్ ఉల్లంఘనల కేసుల సంఖ్య. ఇందులో ఒక్క రాంగ్ రూట్‌లో నమోదైన కేసులే పన్నెండువేలకు పైగా ఉన్నాయి. అంటే హైదరాబాద్‌లో వాహనదారులు ఎంత యథేచ్ఛగా ట్రాఫిక్ రూల్స్ బ్రేక్ చేస్తున్నారో ఈ కేసుల సంఖ్యే చెబుతోంది. రాంగ్ రూట్‌లో డ్రైవింగ్, సెల్ ఫోన్ చూస్తూ వాహనం నడపడం, త్రిబుల్ రైడింగ్, సిగ్నల్ జంపింగ్, నంబర్ ప్లేట్ ట్యాంపరింగ్, అవసరం లేకున్నా.. అనుమతి లేకున్నా ప్రత్యేక హారన్లు ఉపయోగించడం, డ్రంక్ అండ్ డ్రైవ్.. ఇలా ట్రాఫిక్ నిబంధనలను అతిక్రమిస్తూ యథేచ్ఛగా ఉల్లంఘనలకు పాల్పడడంతో నగరంలో ట్రాఫిక్ అస్తవ్యస్తమవుతోంది. నిబంధనలు పాటించాలని హైదరాబాద్ కమిషనరేట్ పోలీసులు ఎంతగా అవగాహన కల్పిస్తున్నా.. వాహనదారుల్లో మాత్రం మార్పు రావడం లేదు. ముఖ్యంగా సిటీ రోడ్లపై యువత వాహనాలను నడిపే సమయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఈనెల 3నుంచి కమిషనరేట్ పరిధిలో ట్రాఫిక్ విభాగం ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. ఇందులో ప్రధానంగా రాంగ్ సైడ్ డ్రైవింగ్, హారన్ల వినియోగం, నంబర్ ప్లేట్ ట్యాంపరింగ్‌పై ప్రత్యేక దృష్టి పెట్టారు. ఈ నేపథ్యంలో వేల సంఖ్యలో కేసులు నమోదవుతున్నాయి.

61 ప్రాంతాల్లో..

రాంగ్‌రూట్ డ్రైవింగ్ ఎక్కువగా యూటర్న్ వద్దే జరుగుతున్నాయని, నగరంలో ఎక్కువగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాలకు రాంగ్‌సైడ్ డ్రైవింగే కారణంగా పోలీసులు గుర్తించారు. . కొందరు యూటర్న్ తీసుకునేందుకు ఒకటి నుంచి రెండు కిలోమీటర్లు వెళ్లాల్సి వస్తుందని షార్ట్‌కట్‌లో ప్రయాణిస్తున్నారు. ఎక్కడా ట్రాఫిక్ సిగ్నల్స్‌ను పట్టించుకోకుండానే డేంజరస్ డ్రైవింగ్‌చేస్తున్నారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్ సిటీ కమిషనరేట్ పరిధిలో 61 ప్రాంతాల్లో అత్యధికంగా రాంగ్‌రూట్ డ్రైవింగ్ జరుగుతున్నట్లు పోలీసులు గమనించారు. ఇలాంటి ప్రాంతాల్లో వాహనదారులు వన్‌వే, సిగ్నల్స్, యూటర్న్స్, ఫ్లై ఓవర్స్ కింద, నో ఎంట్రీ రూట్‌లో ఎక్కువగా రాంగ్‌రూట్ డ్రైవింగ్‌చేస్తున్నారు. రద్దీ ఎక్కువగా ఉండే పాతబస్తీ, అమీర్‌పేట, ఖైరతాబాద్, పంజాగుట్ట, సికింద్రాబాద్ వంటి ప్రాంతాల్లో షార్ట్ కట్ కోసం రాంగ్ సైడ్‌లో వెళ్తున్నారు. ఇలాంటి డ్రైవింగ్ వల్ల ట్రాఫిక్ రూల్స్ పాటించేవారు కూడా ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈనెలలో ట్రాఫిక్ పోలీసులు చేపట్టిన స్పెషల్ డ్రైవ్‌లో ఐదు రోజుల్లో 12వేలకు పైగా రాంగ్‌రూట్, 13వందల నబర్ ట్యాంపరింగ్ కేసులు, 1200కు పైగా హారన్ దుర్వినియోగం కేసులు నమోదయ్యాయంటే వాహనదారులు ఎంత నిర్లక్ష్యంగా ఉంటున్నారో గమనించవచ్చని ట్రాఫిక్ పోలీసులు చెబుతున్నారు. అంతేకాకుండా నగరంలో గత నెల చివరివారంలో నిర్వహించిన

(మిగతా 2వ పేజీలో)

దవాఖానల్లో లిఫ్టులు సేఫేనా?

- కరువైన నిర్వహణ.. రోగులకు అవస్థలు
- సర్వసాధారణంగా మారిన సాంకేతిక సమస్యలు
- ఆపరేటర్లు లేకపోవడంతో తలెత్తుతున్న ఇబ్బందులు

సిటీబ్యూరో, 15 (నమస్తే తెలంగాణ)/బన్సీలాల్ పేట/చార్మినార్/ఖైరతాబాద్: గ్రేటర్ పరిధిలోని 7 ప్రభుత్వ దవాఖానలు, 5 వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయాలతో పాటు 839 ప్రైవేటు దవాఖానల్లో లిఫ్టులను వినియోగిస్తున్నారు. ముఖ్యంగా ఉస్మానియా, గాంధీ, నిమ్స్, నిలోఫర్, ఎంఎన్‌జే తదితర ప్రభుత్వ రంగ దవాఖానల్లో ప్రతి నిత్యం వేలాది మంది రోగులు వైద్య సేవల కోసం లిఫ్టులను ఆశ్రయిస్తుంటారు. వీరితో పాటు కార్పొరేట్, ప్రైవేటు రంగ దవాఖానల్లో సైతం వేల సంఖ్యలో రోగులు లిఫ్టులను వినియోగిస్తున్నారు. దవాఖానల్లో అనారోగ్యంతో వచ్చే రోగులు, వారి సహాయకులు, వైద్యసిబ్బంది లిఫ్టులను వినియోగిస్తారు. కొన్ని కార్పొరేట్ దవాఖానల్లో 18 అంతస్తుల వరకు వైద్యసేవలు అందుబాటులో ఉంచడంతో రోగులు ఆర్టీసీ బస్సుల మాదిరిగా లిఫ్టుల కోసం నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొందంటే దవాఖానల్లో లిఫ్టులు ఎంత అత్యవసరమో అర్థం చేసుకోవచ్చు. అయితే ఇంత అత్యవసరమైన ఈ లిఫ్టుల పర్యవేక్షణ, పరిపాలనపై భిన్న కథనాలు వినిపిస్తున్నాయి. కొన్ని ప్రభుత్వ, ప్రైవేటు దవాఖానల్లో లిఫ్టుల మెయింటనెన్స్ తూతూ మంత్రంగా ఉంటున్నాయి. తరచూ అవి మరమ్మతులకు గురికావడం, మధ్యలోనే ఆగిపోవడం, సాంకేతిక సమస్యలు తలెత్తడం వంటి ఘటనలు సర్వసాధారణంగా మారినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏదైనా ఘటన జరిగితే తప్ప విషయం బయటకు రాని పరిస్థితి నెలకొన్నదని రోగులు ఆరోపిస్తున్నారు.

రోగుల భద్రత గాలికి..

కొన్ని ప్రభుత్వ, ప్రైవేటు దవాఖానల్లో రోగుల కోసం, వైద్య సిబ్బంది కోసం వేర్వేరుగా లిఫ్టులను అందుబాటులో ఉంచారు. కొన్ని దవాఖానల్లో రోగుల భద్రతను గాలికొదిలేస్తున్నారు. అటు సరైన మెయింటనెన్స్ లేకపోవడమే కాకుండా లిఫ్టులో ఆపరేటర్లను నియమించడకపోవడంతో లిఫ్టులో సాంకేతిక సమస్యలు ఏర్పడినప్పుడు రోగులు ప్రమాదంలో చిక్కుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలోనే మూడురోజుల కిందట గాంధీ దవాఖానలో సాంకేతిక సమస్యల కారణంగా మధ్యలో నిలిచిపోయిన లిఫ్టులో ఒకేసారి దాదాపు 20మంది వరకు రోగులు, వారి సహాయకులు చిక్కుకున్నారు. ఆ సమయంలో లిఫ్టులో ఆపరేటర్ ఉండి ఉంటే రోగులకు ఇబ్బందులు తప్పేవి. కానీ ఆపరేటర్ లేకపోవడంతో దాదాపు 30నిమిషాల పాటు వారు తమ ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని బిక్కుబిక్కుమంటూ గడిపారు. తీరా సమాచారం అందుకున్న సిబ్బంది వెంటనే వచ్చి వారిని క్షేమంగా బయటకు తీయడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. అదృష్టవశాత్తు పెద్ద ప్రమాదం తప్పినట్లైంది. ఇలాంటి ఘటనలు తరచూ ప్రభుత్వ రంగ దవాఖానల్లోనే కాకుండా ప్రైవేటు రంగ దవాఖానల్లో సైతం జరుగుతున్నా సంబంధిత అధికారులు గాని, యాజమాన్యాలు గాని పట్టించుకోవడం లేదని రోగులు ఆరోపిస్తున్నారు.

గాంధీ దవాఖానలో ఉన్న లిఫ్ట్

గాంధీ దవాఖానలో..

గాంధీ హాస్పిటల్ లో మొత్తం 12 లిఫ్టులు అందుబాటులో ఉన్నాయి. దవాఖానలోని ప్రధాన భవనంలో 9, మాతా శిశు సంరక్షణ కేంద్రం (ఎంసీహెచ్) భవనంలో మూడు లిఫ్టులు ప్రస్తుతం పని చేస్తున్నాయి. అయితే ప్రధాన భవనంలో ఉన్న వైద్య సిబ్బంది వినియోగించే లిఫ్టులలో మాత్రమే ఆరుగురు లిఫ్ట్ ఆపరేటర్లు పనిచేస్తున్నారు. మూడు షిఫ్టులలో వారు విధులు నిర్వహిస్తున్నారు. కానీ రోగులు వినియోగించే లిఫ్టులలో ఆపరేటర్లు లేకపోవడంతో భద్రత ప్రశ్నార్థకంగా

(మిగతా 2వ పేజీలో)

హెచ్‌సీయూ భూముల వేలంపై న్యాయబద్ధంగా పోరాడతాం

- 400 ఎకరాల భూముల అమ్మకాన్ని ఆపకుంటే ఉద్యమిస్తాం
- ప్రభుత్వం దిగివచ్చే దాకా నిరసనలు కొనసాగిస్తాం
- హెచ్‌సీయూ జేఏసీ సమవేశంలో తీర్మానం

సిటీబ్యూరో: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ పరిధిలోని 400 ఎకరాల భూమిని వేలం వేస్తామని ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా న్యాయబద్ధంగా పోరాడతామని జేఏసీ ప్రకటించింది. ఈమేరకు శనివారం యూనివర్సిటీ క్యాంపస్‌లో జేఏసీ సమావేశమై భూముల విషయంలో ప్రభుత్వ వైఖరిపై ఏ విధంగా ముందుకు సాగాలనే అంశంపై చర్చించారు. హెచ్‌సీయూ భూములను విక్రయించాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకుంటే పోరాటాలు ఉధృతం చేస్తామని తీర్మానించారు. భూముల కొనుగోలు, అమ్మకాల కోసం యూనివర్సిటీలోకి ఎవరినీ రానీయకుండా అడ్డుకుంటామని స్పష్టం చేశారు. ప్రభుత్వం హెచ్‌సీయూ భూములను అమ్మకానికి పెట్టి పర్యావరణాన్ని నాశనం చేసేందుకు కుట్ర చేస్తున్నదని ఆరోపించారు. యూనివర్సిటీ భవిష్యత్, పర్యావరణాన్ని కాపాడేందుకు విద్యార్థులు, ఉద్యోగులు కలిసికట్టుగా ఉద్యమాన్ని కొనసాగిస్తామని తెలిపారు. భూముల అమ్మకం నిర్ణయాన్ని అన్ని రాజకీయ పార్టీలు, స్వచ్ఛంద సంస్థలు, విద్యార్థులు వ్యతిరేకిస్తున్నా కాంగ్రెస్ ప్రభుత్వం మొండి వైఖరిపై జేఏసీ ప్రతినిధులు మండిపడ్డారు.

భూములు కోల్పోతే అంధకారమే..

ఉన్నతమైన ప్రమాణాలు, నాణ్యమైన విద్య, పరిశోధనలతో దక్షిణ భారతంలో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ పేరు ప్రఖ్యాతలు సంపాదించిందని జేఏసీ ప్రతినిధులు అన్నారు. భవిష్యత్‌లో మరిన్ని రీసెర్చ్ సెంటర్లు, ప్రయోగశాలలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని, అందుకు వందల ఎకరాల భూమి అవసరం ఉంటుందని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం అక్రమంగా భూములను అమ్మితే యూనివర్సిటీ భవిష్యత్ అంధకారంలోకి వెళ్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా కండ్లు తెరిచి భూముల వేలం నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే న్యాయబద్ధంగా పోరాడతామని స్పష్టం చేశారు.

గడువు ముగిసింది సీజ్ మిగిలింది

చందానగర్ సర్కిల్‌లో ఆస్తి పన్ను బకాయిదారులపై కఠిన చర్యలు

మియాపూర్, మార్చి 15: ఆస్తి పన్ను బకాయి దారులపై కఠిన చర్యలకు జీహెచ్ ఎంసీ అధికారులు సిద్ధమవుతున్నారు. పన్ను బకాయిల చెల్లింపు కోసం ఇప్పటికే ఓ టీఎస్‌ను ప్రకటించిన నేపథ్యంలో బకాయిలన్నింటిని పూర్తిస్థాయిలో వసూలు చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రభుత్వం ఈ అవకాశం కల్పించినప్పటికీ బకాయిలను చెల్లించని వ్యాపార వాణిజ్య సముదాయాలకు తాళం వేసి.. సీజ్ చేసే ప్రక్రియను మరింత వేగవంతం చేయనున్నారు. శేరిలింగంపల్లి జోన్ పరిధిలోని చందానగర్ సర్కిల్లో 75 మంది పెద్ద మొత్తంలో ఆస్తి పన్ను బకాయి పడ్డారు .ఇప్పటికే వారికి నోటీసులను జారీ చేశారు. నోటీసు గడువు సైతం తాజాగా ముగిసింది.ప్రభుత్వం ఓ టీ ఎస్ ను కల్పించినప్పటికీ ఇంకా బకాయిదారుల్లో చలనం రాకపోతుండడంతో సీచ్ మంత్రాన్ని అమలు చేసేందుకు సిదమవుతున్నారు రూ.5 లక్షలకు పైగా ఆస్తిపన్ను బకాయిలు ఉన్నవారు చందానగర్ సర్కిల్ పరిధిలో సుమారు 75 వరకు ఉన్నట్లు అధికారులు తెలిపారు. పన్ను బకాయిలను చెల్లించాలని ఇప్పటికే వారికి నోటీసులను జారీ చేశారు. ప్రభుత్వం ఓ టీ ఎస్ సైతం ప్రకటించిందని వడ్డీ రాయితీని సద్వినియోగం చేసుకోవాలని నోటీసుల్లో స్పష్టం చేశారు. అయినప్పటికీ బకాయి దారులలో స్పందన రాకపోతుండడంతో, సోమవారం నుంచి సదరు వ్యాపార కేంద్రాలను సీజ్ చేయాలని నిర్ణయించారు .ఇప్పటికే ఈ తరహా పన్ను బకాయిదారుల జాబితాను సిద్ధం చేశారు. ఇప్పటికే మాదాపూర్ డివిజన్ పరిధిలో రూ. 24 లక్షలకు గాని వాణిజ్య భవనం పన్ను బకాయి ఉండడంతో నెల కిందట సదురు భవనానికి అధికారులు తాళం వేశారు. పన్నులు చెల్లించకపోవడంతో ఇప్పటివరకు తాళం కొనసాగుతోంది. ఓటీఎస్‌ను ప్రకటించడంతో సదురు బకాయిదారు తన ఆస్తి పన్ను బకాయిని చెల్లించేందుకు సిద్ధమయ్యారు. ఇదే తరహాలో మొండి బకాయిదారుల వ్యాపార వాణిజ్య కేంద్రాలను సీజ్ చేయడం ద్వారా తగిన గుణపాఠం నేర్పేందుకు చందానగర్ సర్కిల్ పన్ను విభాగం అధికారులు రంగం సిద్ధం చేశారు. అవసరమైతే ఆస్తులను జప్తు చేసి తమ పన్ను బకాయిలను వసూలు చేసుకునేందుకు వెనకాడబోమని అధికారులు పేర్కొంటున్నారు.

చందానగర్ సర్కిల్ కార్యాలయం

లిఫ్ట్ కావాలంటే ఎన్‌వోసీ తప్పనిసరి!

సిటీబ్యూరో : రాష్ట్రంలో లిఫ్ట్ ప్రమాదాలు పెరుగుతున్న నేపథ్యంలో లిఫ్ట్ పాలసీ తయారుచేసే బాధ్యతలను విద్యుత్ శాఖపై సర్కార్ పెట్టింది. కొంతకాలంగా పెండింగ్‌లో లిఫ్ట్ పాలసీ 2025ను మరికొద్దిరోజుల్లోనే అమల్లోకి తీసుకురానున్నట్లు విద్యుత్ అధికారులు తెలిపారు. ఈ పాలసీ అమల్లోకి వచ్చిన తర్వాత ఎక్కడైనా లిఫ్ట్ పెట్టాలంటే తప్పనిసరిగా విద్యుత్ ఇన్‌స్పెక్షన్ విభాగం నుంచి ఎన్‌వోసీ తప్పనిసరిగా ఉండాలి. ఈ నేపథ్యంలో పాలసీలో ఎటువంటి మార్గదర్శకాలు ఉండాలనే అంశాలపై విద్యుత్, ఫైర్, పోలీస్, ఇంజినీరింగ్ విభాగాలు చర్చిస్తున్నట్లు సమాచారం. లిఫ్ట్ ఇండస్ట్రీపై ప్రభుత్వ నియంత్రణ, పర్యవేక్షణ లేకపోవడంతో సమస్యలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఈ పరిశ్రమకు సంబంధించి ప్రత్యేక పర్యవేక్షణ వ్యవస్థ అవసరమని నిపుణులు అభిప్రాయపడ్డారు. ప్రధానంగా చాలా మంది లిఫ్ట్ ఆపరేటర్లు తాము చేసే వ్యవస్థలో స్పీడ్ గవర్నర్లు, ఎమర్జెన్సీ బ్రేకులు వంటి సరైన ప్రమాణాలు పాటించకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.

మల్టీ లెవల్ పార్కింగ్‌లో మడతలెన్నో..

- తవ్విన కొద్దీ వెలుగు చూస్తున్న పార్కింగ్ టెండర్ బాగోతాలు
- కోట్లు విలువ చేసే వెయ్యి గజాల జాగాపై పెద్దల కన్ను
- గద్దలా హస్తగతం చేసుకునేలా టెండర్ల మాయాజాలం

సిటీబ్యూరో, మార్చి 15 (నమస్తే తెలంగాణ) : కేబీఆర్ పార్క్ మల్టీ లెవల్ పార్కింగ్ టెండర్ ప్రక్రియలో ఎన్నో మలుపులు, మరెన్నో మడతలు ఉన్నాయి. పేరుకు వెహికిల్ పార్కింగ్ సదుపాయం కల్పిస్తున్నామని చెబుతున్నా... దీని వెనుక ఎంతో మంది పెద్దల చేతులు ఉన్నాయి. ఆ నేతల అడుగులకు మడుగులు వేస్తూ దస్త్రాలను సునాయాసంగా కదిలిస్తున్న అధికారుల పాత్ర ఉంది. పెద్దల సూచనలకు అనుగుణంగా కంపెనీ కోసం పార్కుకు చెందిన 1000 గజాల జాగాను అప్పనంగా కట్టబెట్టేలా బల్దియాలో సంబంధిత ఓ ఉన్నతాధికారి అన్ని తానై చక్రం తిప్పుతున్నాడు. పార్కింగ్ పేరిట బల్దియాలో అడుగుపెట్టి.... శివారు ప్రాంతాల్లో ప్రకటన రంగాన్ని తమ గుప్పిట్లోకి పెట్టుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వంలోని ముఖ్యనేతకు అత్యంత సన్నిహితుడైన వ్యక్తి... ఈ వ్యవహారాన్ని పర్యవేక్షిస్తున్నట్లుగా టాక్. అయితే టెండర్ల ప్రక్రియ నుంచి వర్క్ ఆర్డర్లు పొందేంత వరకు అన్నీ తానై బల్దియా వ్యవహారాలను చక్కబెట్టిన అధికారుల సాయంతో కోట్ల రూపాయల మాయాజాలం జరుగుతున్నదని జోరుగా చర్చ జరుగుతున్నది.

ఇప్పటికే కేబీఆర్ పార్క్ మల్టీ లెవల్ పార్కింగ్ టెండర్ ప్రక్రియలో జరుగుతున్న అవకతవకలను వెలుగులోకి తీసుకువచ్చే క్రమంలో 'నమస్తే తెలంగాణ' లోతైన పరిశీలనలో మరిన్ని విషయాలు వెలుగులోకి వస్తున్నాయి.

కదులుతున్న అవకతవకల పుట్ట..

కేబీఆర్ పార్క్ వద్ద మల్టీ లెవల్ పార్కింగ్ సముదాయం కేటాయింపు వ్యవహారంలో అవకతవకల పుట్ట కదులుతుంది.

(మిగతా 2వ పేజీలో)